అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: రాష్ట్రంలో అర్హులెవరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సాయంత్రం సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీలోని కీటిన్‌పేట, తాతాజీనగర్, ఎల్లమ్మపేటలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా..? లేదా..? అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో 1800 ఓట్లకు 900 వైఎస్సార్‌సీపీకి, మిగిలినవి టీడీపీ, జనసేనకు వేశారన్నారు. అయినప్పటికీ పంచాయతీలో ప్రభుత్వ ఉద్యోగులు తప్ప 92 శాతం మందికి ఈ నాలుగేళ్లలో రూ.11 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఇంకా ఎవరైనా సంక్షేమ పథకాలు పొందలేకపోతే వారి కోసం జగనన్న సురక్ష పేరుతో మారోమారు ఇళ్లన్నీ సర్వే చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు టీడీపీ, జనసేన మాయగాళ్లు వస్తే వారి మాటలు నమ్మవద్దని కోరారు.

రియల్ హీరో జగనే..

సినిమాలు చూసి ప్రజలు మోసపోయే రోజులు ఇవి కాదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. రాజకీయాల్లో, నిజ జీవితంలో రియల్ హీరో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాలు, చెత్త తరలింపునకు వాహనం కావాలని, డ్రైనేజీలు, సీసీరోడ్లు, శ్మశానవాటికలో షెడ్లు నిర్మించాలని స్థానికులు కోరగా... పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పీతల గంగ శ్రీను, మల్లేటి హరి, ఎంపీడీవో పి.వెంకటరమణ, వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, జీరు వెంకటరెడ్డి, కేపీ సత్యనారాయణ, దుంపల ప్రభాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కాద సూర్యనారాయణ, జీవీ రమణ, చెల్లూరి నగేష్, పాట్నూరు చంద్రశేఖర్, మద్దిల వెంకటరమణ, శిరిగుడి ఈశ్వరరావు, మేరుగు ఎల్లాజీ, కొల్లి కోటిరెడ్డి, భాగం సుధాకర్, పల్లా సన్యాసిరావు, తుపాకుల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



కీటిన్‌పేటలో లబ్ధిదారుకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

క్లుప్తంగా

పరశురామావతారంలో జగన్నాథుడు



భీమునిపట్నం: భీమిలిలో జరుగుతున్న జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ఆర్.సింగరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అవతార విశిష్టతను భక్తులకు వివరించారు.

నవధాన్యాల సాగుతో భూసారం



మాట్లాడుతున్న సేంద్రియ వ్యవసాయం జిల్లా డీపీఎం మోహన్‌రావు

పద్మనాభం: నవ ధాన్యాలు సాగు చేస్తే భూసారం పెరిగి, ఆరోగ్యంగా ఉంటుందని సేంద్రియ వ్యవసాయం జిల్లా డీపీఎం మోహన్ రావు అన్నారు. మండలంలోని గంధవరం ఆర్బీకేలో రైతులకు సోమవారం ఆయన నవ ధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు నవ ధాన్యాలు సాగు చేయాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం రీజినల్ ఆఫీసర్లు ప్రకాష్, హేమసుందర్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆనందపురం : మండలంలోని గిడిజాల 33/12 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం లైన్ల మరమ్మతుల దృష్ట్యా పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని స్థానిక సబ్‌స్టేషన్ ఏఈఈ సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. గిడిజాల, బాకురుపాలెం, గుమ్మిడివానిపాలెం, రేగానిగూడెం, మిందివానిపాలెం, చిన్నయ్యపాలెం తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు తెలిపారు.

మధురవాడ సబ్ స్టేషన్ పరిధిలో రేపు...

మధురవాడ: మధురవాడ సబ్ స్టేషన్ పరిధిలోని వుడా కాలనీలో 11 కేవీ ఫీడర్ నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మధురవాడ, కొమ్మాది సబ్ స్టేషన్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎస్‌వీఎస్ రామమూర్తి, వి.సంతోష్ కుమార్ చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు కొమ్మాది జంక్షన్, శ్రీనివాసనగర్, సాయిరాం కాలనీ, జీసీసీ లే అవుట్, టీచర్స్ లే అవుట్, అన్నంరాజు లే అవుట్, డీఆర్‌కే రాజు లే అవుట్, రిక్షా కాలనీ, ప్రశాంతినగర్, వైభవ్‌నగర్, సాయిరాంకాలనీ, డ్రైవర్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. అదేవిధంగా వుడా కాలనీ ఫీడర్ పరిధిలో ఎన్‌జీజీవోస్ కాలనీ, చంద్రంపాలెం, సుద్దగెడ్డ, వాంబేకాలనీ, పోర్టు కాలనీ, శ్రీనివాసనగర్ పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు.

ప్రజల కోసమే ‘జగనన్న సురక్ష’

పద్మనాభం: జగనన్న సురక్షను అందరూ ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బాందేవుపురంలో సోమవారం సాయంత్రం జగనన్న సురక్షపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో, తహసీల్దార్‌తో కూడిన బృందాలు సచివాలయ సిబ్బంది, వలంటీర్లను సమన్వయం చేసుకుని 11 అంశాల్లో ప్రజల అవసరాలు తెలుసుకొని నమోదు చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్, ఆదాయం, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కావాల్సివారిని, ఆధార్ కార్డుకు మొబైల్ నంబర్ అప్‌డేట్ చేయాల్సిన, కొత్త రేషన్ కార్డులు కావాల్సిన వారిని గుర్తించాలని సూచించారు. జూలై 4 నుంచి ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కోటి 26 లక్షల కుటుంబాలకు రూ.2 లక్షల కోట్లు లబ్ధి చేకూర్చామన్నారు. రూ.10 లక్షలతో బాందేవుపురం ప్రాథమిక పాఠశాలను, ఎస్సీల శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయాలని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా కోరాడ గ్రామానికి చెందిన కోరాడ నరసింహునాయుడుకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.2.50 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో భాస్కరరెడ్డి, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, తహసీల్దార్ టి.శ్రీవల్లి, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, బాందేవుపురం సర్పంచ్ వాజిగాని ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు బోని సావిత్రి, విలాస్కాన్‌పాలెం సర్పంచ్ నల్లి సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకులు బోని సన్యాసినాయుడు, సాగి కృష్ణమూర్తిరాజు, సుంకర పైడినాయుడు, సుంకర బంగారప్పడు, సిరుగుడి ఆదినారాయణ, జి.వి.కె.కె.వర్మ, మామిడి శివరామకృష్ణ, చందక శ్రీను, చందక పైడినాయుడు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



నరసింహనాయుడుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

శ్మశానవాటికలో వసతులు కల్పించాలని వినతి

తగరపువలస: చిల్లపేట శ్మశానవాటికలో వసతులు కల్పించాలని కోరుతూ భీమిలి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో వైఎస్సార్‌సీపీ రెండో వార్డు నాయకులు జెడ్సీ బి.రాముకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, సీనియర్ నాయకులు బింగి హరికిరణ్‌రెడ్డి, బోర రామారావు తదితరులు మాట్లాడుతూ చిల్లపేట, జీరుపేట, రెల్లిపేట, సుభీభవ తదితర ఏడు గ్రామాల ప్రజలు వినియోగించుకునే శ్మశానవాటికను చదును చేసి ప్రహరీ, రేకుల షెడ్లు నిర్మించాలని, విద్యుత్ దీపాలు అమర్చాలని కోరామన్నారు.

- స్పందనకు 9 వినతులు వచ్చినట్టు జెడ్సీ రాము తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగం నుంచి రెండు, ఇంజినీరింగ్ విభాగం నుంచి ఏడు వినతులు వచ్చాయని, పరిష్కారానికి సంబంధిత విభాగాల అధికారులకు పంపించామని తెలిపారు.



భీమిలి జెడ్సీ రాముకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కస్తూర్బా విద్యాలయం పరిశీలన

భీమునిపట్నం: భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని రాష్ట్ర సమగ్ర శిక్ష పథకం ప్రాజెక్ట్ అధికారి బి.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఏ విధంగా చదువుతున్నారు..?, వారికి ఎటువంటి సదుపాయాలు అందుతున్నాయో పరిశీలించారు. జగనన్న విద్యా దీవెన కిట్లు విద్యార్థినులకు అందించారు. అనంతరం మధ్యాహ్న భోజనానికి సిద్ధం చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. ఇక్కడ తాగునీటి సమస్య ఉన్న విషయం తెలియడంతో త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, అందరూ సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. ఆర్‌జేడీ జ్యోతికుమారి, డీఈవో చంద్రకళ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఆహారం పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

జీవీఎంసీ ‘స్పందన’కు 21 అర్జీలు

మధురవాడ: ఏళ్ల తరబడి కాలువ నిర్మించమని అడిగితే నిర్మించకపోగా ఇంటి ముందు గోతులు తవ్వి వదిలేశారని బోయిపాలెం సమీపంలో నివసిస్తున్న రమణారావు వాపోయారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉన్న ఆయన భార్య సహాయంతో వచ్చి సమస్య పరిష్కరించాలని అధికారులను వేడుకున్నాడు.

ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి 21 అర్జీలు వచ్చాయి. మధురవాడ పరిసర ప్రాంతాల్లోని క్రిస్టియన్ శ్మశాన వాటికలకు అధికారుల సమక్షంలో కమిటీలు వేయాలని పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్ తరంగ్, ప్రతినిధులు కోరారు. బక్కన్నపాలెం జోగన్న గారి వీధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, వీధిలైట్లపై జోగారావు తదితరులు వినతిపత్రం ఇవ్వగా తక్షణమే సమస్యలు పరిష్కరిస్తామని జెడ్సీ హామీ ఇచ్చారు.



జెడ్సీ కనక మహాలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న పాస్టర్లు

మోదీ పాలనపై ప్రచారం

పద్మనాభం: ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల సుపరిపాలనపై బీజేపీ నాయకులు కోరాడ, శేరిఖండం, పాట్నూరు గ్రామాల్లో సోమవారం ఇంటింట ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్, నాయకులు ఉప్పాడు అప్పారావు, ఆర్.శ్రీనివాసరావు, పి.కృష్ణారావు పాల్గొన్నారు.

సంగివలస చెరువు పరిశీలించిన అధికారులు

తగరపువలస: సంగివలస కొండప్ప చెరువును జీవీఎంసీ అధికారులు సోమవారం పరిశీలించారు. ‘ఇన్ ఫ్లో మూసేసి... అవుట్ ఫ్లో ఎత్తు పెంచేసి...’ శీర్షికతో సోమవారం సాక్షిలో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. భీమిలి జెడ్సీ బి.రాము, డీఈ మత్స్యరాజు, రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు తదితరులు చెరువు ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో, గట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా చెరువుకు అవతలి వైపు అల్లూరి సీతారామరాజు కాలనీ సమీపంలో డ్రైనేజీ తవ్వకాన్ని స్థానికులు వ్యతిరేకించారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్తామని హెచ్చరించారు. అధికారులతోపాటు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



సంగివలస చెరువు వద్ద స్థానికులతో మాట్లాడుతున్న జెడ్సీ రాము, డీఈ మత్స్యరాజు

‘మధ్యాహ్న భోజనం’లో తప్పిన అంచనా

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహణలో అంచనా తప్పడంతో సోమవారం సుమారు 500 మంది విద్యార్థులకు కూర సరిపడలేదు. దీంతో వారంతా అర గంట సమయంపాటు నిరీక్షించాల్సి వచ్చింది. ఇక్కడ 3 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారిలో కొంతమంది సొంతంగా భోజనం తెచ్చుకోగా... సుమారు 2 వేల మంది అక్షయపాత్ర వారు సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనం చేస్తుంటారు. అయితే అనూహ్యంగా సోమవారం భోజనం చేసే వారి సంఖ్య 2,700కు చేరడంతో కొందరు విద్యార్థులకు కూర చాలలేదు. దీంతో అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు కూర తీసుకొచ్చి వడ్డించారు.



కూర కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

మాదక ద్రవ్యాలతో భవిత అంధకారం



ర్యాలీలో నవజీవన్ పాఠశాల విద్యార్థులు



చిట్టివలసలో ర్యాలీలో శ్రీకృష్ణా డిగ్రీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది



ఎస్ఈబీ ఆధ్వర్యంలో భీమిలి బీచ్‌రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, సిబ్బంది

తగరపువలస: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై భీమిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు పలు విద్యాసంస్థల్లో సోమవారం అవగాహన కల్పించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా తగరపువలసలోని శ్రీబాసర, నాయుడు కళాశాలలు, చెరకుపల్లి అవంతి, సంగివలస అనిట్స్, దాకమర్రి రఘు విద్యాసంస్థలు, మహరాజుపేటలో ఇమ్మానుయేల్ ఫార్మసీ కళాశాలల్లో అవగాహన కల్పించి, ర్యాలీలు చేయించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వ్యసనాలకు బానిసలైతే భవిష్యత్ అంధకారమయం అవుతుందని తెలిపారు.

తగరపువలస: మాదక ద్రవ్యాల వినియోగానికి అందరూ దూరంగా ఉండాలని కోరుతూ చిట్టివలస శ్రీకృష్ణా డిగ్రీ కళాశాల విద్యార్థులు బొగ్గురోడ్డులో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బి.నరసింగరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు మనిషిని పతనం చేస్తాయన్నారు. వాటికి బానిసలైతే విలువలు కోల్పోయి సమాజంలో హీనస్థితికి చేరుకుంటారన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు ఎక్కడైనా మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం కనిపిస్తే స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో టోల్ ఫ్రీ నంబరు 14500కు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కె.చిట్టిరెడ్డి, ప్రిన్సిపాల్ జె.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పద్మనాభం: మాదక ద్రవ్యాలు సేవించడం మాని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరుతూ మద్ది గ్రామంలోని ఓం సాయి స్కూల్, కళాశాల విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ డ్రగ్స్ రహిత రాష్ట్రం దిశగా పయనించాలని ప్లకార్డులు ప్రదర్శించి ర్యాలీ చేశారు. స్కూల్ నుంచి శిర్లపాలెం జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం శిర్లపాలెం జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు.

భీమునిపట్నం: ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు చిన్నబజారు, మెయిన్‌రోడ్డు, పెద్ద బాజారు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గంటస్తంభం జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధ్యాపకులు బీవీ శ్రీనివాసరావు, అప్పన్నబాబు, విశ్వనాథం పాల్గొన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) ఆధ్వర్యంలో విద్యార్థులు బీచ్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. మాదవ ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల విద్యార్థులకు వివరించారు. నవజీవన్ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైనేజీల పూడిక డంపింగ్‌తో దుర్వాసన

తగరపువలస: ఇటీవల భీమిలి రోడ్డులో చిల్లపేట చెరువును ఆనుకుని డ్రైనేజీల్లో తొలగించిన వందలాది లారీల లోడుల పూడికను తీసుకెళ్లి గల్లీ రోడ్డులోని చిల్లపేట శ్మశానవాటికలో డంప్ చేశారు. ఈ పూడికలో పాలిథిన్ కవర్లు, గాజుసీసాలు, వాడిపడేసిన పరుపులు, పాత వస్త్రాలు ఎక్కువగా ఉన్నాయి. పూడిక డంప్ చేసిన శ్మశాన వాటిక గోతులతో కూడి ఉండటంతో వర్షాలు కురిస్తే పూడికలో ఉన్న వస్త్రాలు, సీసాలు, పాలిథిన్ తేలియాడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసిన పూడికను చదును చేసి దానిపై గ్రావెల్ వేసి గట్టిగా చేయాలని... లేదా పూడిక తొలగించాలని చిల్లపేట వాసులు కోరుతున్నారు. గుట్టలుగా వేసిన పూడిక కారణంగా శ్మశానవాటికకు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు పూడిక ప్రభావం పక్కనే ఉన్న కేథరిన్ విద్యాసంస్థలపై పడుతోందని, దుర్వాసన భరించలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈగలు, బ్యాక్టీరియా వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతాయంటున్నారు. ముందు జాగ్రత్తగా గుట్టలుగా వేసిన పూడికపై బ్లీచింగ్, ఫినాయిల్ వంటివి చల్లాలని కోరుతున్నారు.

జీవీఎంసీకి ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు

శ్మశానవాటికకు చేరువలో ఉన్న కేథరిన్ విద్యాసంస్థల విద్యార్థులు పూడిక కారణంగా వెలువడిన దుర్వాసనతో సోమవారం ఇబ్బందులు పడటంతో జీవీఎంసీకి ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేశారు. పూడికను కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు తరలించకుండా శ్మశానవాటికలో గోతులను పూడ్చడంపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దుర్వాసన తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. వర్షం కురిస్తే మరిన్ని ఇబ్బందులు తలెత్తుతాయని, త్వరగా ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.



చిల్లపేట శ్మశానవాటికలో డంప్ చేసిన చిట్టివలస చెరువు డ్రైనేజీల పూడిక

పొంగి పొర్లుతున్న హైవే డ్రైనేజీలు

తగరపువలస: స్థానిక బైపాస్ రోడ్డులో డ్రైనేజీలు నిండిపోయి మురుగునీరు సర్వీస్ రోడ్డు మీదుగా పొంగి పొర్లుతోంది. పాత లోకల్ ఆఫీసు వీధి, సూర్యా నర్సింగ్ హోం మొదలుకుని రామన్నపేట వరకు సర్వీస్ రోడ్డుపై అడుగు ఎత్తు మేర మురుగు ప్రవహిస్తోంది. స్థానికులు కూడా యూజ్ అండ్ త్రో భోజన పళ్లాలను గోనె సంచులతో తీసుకొచ్చి డ్రైనేజీ పక్కన పడేయడంతో ఈ ప్రదేశం చూడటానికి జుగుప్సాకరంగా ఉంది. ఈ ప్రాంతంలో డ్రైనేజీలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం, డ్రైనేజీలు పాలిథిన్ సంచులు, ఖాళీ సీసాలు, కొబ్బరి బోండాలతో నిండిపోవడంతోనే మురుగునీరు ప్రవహించడానికి అవకాశం లేకుండా రోడ్లపైకి చేరుకుందని స్థానికులు అంటున్నారు. కొంతమంది చెత్తను క్లాప్ వాహనాలకు ఇవ్వకుండా డ్రైనేజీల్లో వేసేస్తున్నారని, అలాంటి వారిని వలంటీర్లతో గుర్తించి చెత్తను వాహనాలకు ఇచ్చేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



సూర్యా నర్సింగ్ హోం సమీపంలో సర్వీస్ రోడ్డు మీద మురుగు నీరు

దుర్గానగర్‌లో క్షీణించిన పారిశుధ్యం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ దుర్గానగర్‌లో పూర్తి స్థాయిలో పారిశుధ్యం లోపించింది. ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా రోడ్లపై కుప్పలుగా వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఇక్కడ నివసించాలన్నా, ఈ మార్గంలో ప్రయాణించాలన్నా ముక్కు మూసుకోవాల్సిందే. దీనికి ఆనుకుని ఉన్న ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ ప్రాంతాల్లో కూడా ఇదే సమస్య వేధిస్తోంది. గతంలో 8వ వార్డులో పారిశుధ్య నిర్వహణపై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేసినా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న శానిటరీ సిబ్బంది మాత్రం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. రోజుల తరబడి వ్యర్థాలు రోడ్లపైనే ఉండిపోవడంతో దుర్వాసనతోపాటు ఈగలు, దోమలతో సహవాసం చేయాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. దీనిపై సచివాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.



దుర్గానగర్‌లో రోడ్డుపై వ్యర్థాలు

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కొమ్మాది: విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని వినియోగించుకుని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయులు ఎం.త్రినాథరావు సూచించారు. జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ వాడపాలెంలో గల జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న కిట్లను వినియోగించుకోవాలని, ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ప్రభుత్వం ఆణిముత్యాలు అవార్డు అందజేస్తుందన్నారు. నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని, అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.

బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయానికి కొత్తగా వచ్చిన బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.మూర్తిశ్రీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజాం మున్సిపాలిటీ నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. జోన్ పరిధిలో నిబంధనల ప్రకారం నిర్మాణాలు జరుగుతున్నాయో..? లేదో..? పరిశీలించి విధులు సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు.

‘స్పందన’కు హాజరుకాని వారికి మెమోలు

మధురవాడ: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ‘స్పందన’ కార్యక్రమానికి అన్ని విభాగాల హెచ్‌వోడీలు హాజరు కావాలని జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారని, ఎవరు రాకపోయినా మెమోలు ఇస్తామని జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి చెప్పారు. మధురవాడలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 11గంటల వరకూ ఒకరిద్దరు కింది స్థాయి అధికారులు, సూపరింటెండెంట్ మినహా ఒక్క హెచ్‌వోడీ కూడా హాజరు కాలేదు. అర్జీదారులకు సమాధానం చెప్పాల్సి రావడంతో విభాగాల అధికారులు లేక ఇబ్బంది ఎదురైంది. దీంతో జెడ్సీ మాట్లాడుతూ అనుమతి లేకుండా గైర్హాజరైన హెచ్‌వోడీలకు మెమోలు ఇవ్వాలని సూపరింటెండెంట్ అప్పలరాజును ఆదేశించారు.